www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 13 | మార్చి | 2026 పేజీలు : 8

## నేడు, రేపు రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు




- ప్రారంభించనున్న కూనంనేని
- హాజరు కానున్న నారాయణ, పల్లా, రామకృష్ణ

**ప్రజాపక్షం/పాల్వంచ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ తరుపున నేడు, రేపు రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. పాల్వంచలోని సుగుణ గార్డెన్స్‌లో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని మిగతా 2లో..

# బలమైన దేశానికి బలహీన ప్రధాని




- యుద్ధ ప్రభావంతో ధరల పెరుగుదల
- ముర్ము వైఖరి సమర్థనీయం కాదు
- సిపిఐ జాతీయ నాయకులు నారాయణ
- కమ్యూనిస్టులను బలహీనపర్చడమే వారి ధ్యేయం : కూనంనేని

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రపంచంలోనే అత్యంత బలమైన ప్రజాస్వామ్యవాధులున్న భారతదేశానికి మోడీ అత్యంత బలహీన ప్రధాని అని, యుద్ధాన్ని ఆపే కనీస పని చేయడం లేదని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డా॥ కె. నారాయణ ఆరోపించారు. ట్రంపుకు సాగిలపడటం తప్ప మోడీ మరేపని చేయలేకపోతున్నారని ఇందిరాగాంధీకి ఉన్న ధైర్యంలో ఐదు శాతం కూడా లేదని ఆయన తెలిపారు. గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ భారతదేశంపై యుద్ధ ప్రభావం ప్రారంభమైందని గ్యాస్ ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని ఎగుమతులు నిలిచిపోవడంతో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కూడా పడిపోనున్నాయని ఆయన తెలిపారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఆర్థిక వనరులున్న దేశాలపై దాడులు చేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వెనుజులా తర్వాత మిగతా 2లో..

## ప్రజల మన్ననలు పొందాలి




- శిక్షణను ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలి
- నిధులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలి
- శిక్షణా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి, కలెక్టర్
- మంచి పనులు చేస్తే ప్రజామోదం పొందుతారు : మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజల మన్ననలు పొందే లా ప్రజాప్రతినిధులు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫలానా నాయకుని హయాంలో మా ప్రాంతం బాగా అభివృద్ధి చెందిందన్న పేరు సంపాదించుకోవాలని తెలిపారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భక్తరామదాసు కళాక్షేత్రంలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్‌లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌లు, వార్డు కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎంఎల్‌ఏ మట్టా రాగమయితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మిగతా 2లో..

## ఇక 'యువవికాసం' లేనట్లేనా..!?

- అమలుకు నోచుకోని ఆర్థిక చేయూత పథకం
- ప్రకటించి ఏడాదైనా పట్టింపు కరువు
- లబ్ధిదారుల్లో నిరాశ

**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** నిరుద్యోగ యువతకు స్వ యం ఉపాధి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం అటకెక్కింది. గతేడాది జూన్ 2 న రాష్ట్ర ఆవతరణ దినోత్సవాల్లో రూ. లక్ష లోపు లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలు మిగతా 2లో..






# ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి




**-ఆత్మ ఛైర్మన్ దిరిశాల**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రైతులు ఆధునీక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని ఖమ్మం డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మండల పరిధిలోని రాంక్యా తండా రైతు వేదిక నందు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ రైతులు ఆధునీక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. ఖర్చు తగ్గించుకుని అధిక లాభాలు వచ్చేటటువంటి ఆయిల్ పామ్ సాగు చేపట్టాలన్నారు. వరిలో కూడా వెదజల్లే పద్ధతులను అవలంభించడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు ఆదాయం లభిస్తుందన్నారు. ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగుతో సేంద్రియ పద్ధతులను అవలంభించాలన్నారు. పర్యావరణ హితమైన సాగు చేపట్టాలని తద్వారా రైతులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రైతులు యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం యాంత్రీకరణ పథకానికి సంబంధించి యంత్రాల కొనుగోలుకు రాయితీలు కూడా అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏవో నారాయణరావు, మండల వ్యవసాయ అధికారి కె. ఉమామహేశ్వర రెడ్డి, ఉద్యానవన అధికారి నగేష్, ఖమ్మం డివిజన్ ఆత్మ బిటిఎం కె. ఆనందరావు, ఏఈవో శివ, ఆత్మ డైరెక్టర్లు, ఇస్కో కంపెనీ ప్రతినిధి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెత్త రహిత వార్డుగా నిలబెట్టడమే లక్ష్యం

**- 30 వార్డు కౌన్సిలర్ దండి శ్రీజ**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీలోనే 30వ వార్డును చెత్త రహిత వార్డుగా నిలబెట్టడమే లక్ష్యమని కౌన్సిలర్ దండి శ్రీజ అన్నారు. ప్రజాపాలనప్రగతిప్రణాళికలో భాగంగా డివిజన్‌లో చేపట్టిన పారిశుధ్య పనులను వేకువ జామునే పరిశీలించారు. అలాగే వార్డుల్లోని ప్రజలతో మాట్లాడుతూ...చేపట్టాల్సిన పనుల గురించి తెలుసుకొని దగ్గరుండి వర్కర్స్‌తో చేపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పారిశుద్ధ్యంలో నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రధాన బాధ్యతగా తెలిపారు. వార్డులో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. రోడ్లు, కాల్వలు శుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షణను మరింత బలోపేతం చేసానని చెప్పారు. ప్రజలు కూడా తమ పరిశరాలను శుభ్రంగా ఉంచడంలో సహకరించాలని కోరారు. ప్రతి వీధిలో క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటామని, కాల్వలు, డ్రైనేజీలు తరచూ శుభ్రం చేసేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచి ఆదర్శంగా నిలిపేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, కిరణ్ స్థానిక కాలనీల సభ్యులు, పారిశుద్ధ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



**-సెల్ఫ్ సెంటర్లపై దృష్టి సారించాలి**
**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి వార్షిక పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బుర్రా మనోజ్, చెన్నంశెట్టి ఆకాష్ లు తెలిపారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మనోజ్, ఆకాష్ లు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసి బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. సెల్ఫ్ సెంటర్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏఎన్ఎం లను అందుబాటులో ఉంచాలని, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పవన్, రవి, నాగరాజు, కుమారస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి




**ప్రజాపక్షం/ మధిర :** రాష్ట్రంలో మొక్కజొన్న పంట ఇప్పటికే చేతికి వచ్చిందని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్నను ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి ఖమ్మం జిల్లాలో అత్యధికంగా సాగు చేసిన మొక్కజొన్న పంట కొనుగోలు కోసం కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రైతులకు అందించాల్సిన పంట సహాయాన్ని కాలం గడిచిపోయినప్పటికీ అందించడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం రైతు సంక్షేమంపై ఆలోచించకుండా రోజువారీ రాజకీయాల్లో మంత్రులు ఎవరికి వారు బిజీగా ఉన్నారని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, దివ్వెల వీరయ్య, మందా సైదులు, పాపినేని రామనర్సయ్య, కిలారు సురేష్, పడకంటి మురళీ, ఎర్రుపాలెం మండల కార్యదరిశ మద్దాల ప్రభాకర్, ఓట్ల శంకరరావు, బంధం శ్రీనివాసరావు, గౌరాజు ధనలక్ష్మీ , రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని వేపకుంట్ల సర్పంచ్ పోట్లపల్లి రమాదేవి రాజా తెలిపారు. గురువారం వేపకుంట్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పం చ్ రమాదేవి హాజరై మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు మంచిగా రాయాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. వీడ్కోలు సందర్భంగా విద్యార్థులు ఆట పాటలు నృత్యాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గాయత్రి, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ముమ్మరంగా పారిశుధ్య పనులు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రఘునాథపాలెం మండలంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 99 రోజుల ప్రణాళికలో భాగంగా పలు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాన్ని శుభ్రం చేయడంతో పాటు వీధుల వెంబడి ఉన్న చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. డ్రైనేజీలను శుభ్రం చేయడంతో పాటు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగింపు చేపట్టారు. వేపకుంట్ల గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను గురువారం సర్పంచ్ పోట్లపల్లి రమాదేవి రాజా పరిశీలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇంటితో పాటు చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీల వెంబడి చెత్త వేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెంపటి ఉపేందర్‌పై అట్రాసిటీ కేసు నమోదు

**- ఓ వ్యాపారిని కులం పేరుతో దూషించి దాడి చేయడంపై చర్య**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని 29వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు వెంపటి ఉపేందర్‌పై ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...30వ వార్డుకు చెందిన తలారి రాధ కృష్ణ 29వ వార్డులోని అక్కిపల్లి కర్ణచారి కట్టెలమండెను అద్దెకు తీసుకున్నాడు. ఆ షాప్‌కు విద్యుత్ అవసరం ఉండటంతో యజమాని పక్కనే ఉన్న వెంపటి ఉపేందర్ ఇంటి నుంచి విద్యుత్ కనెక్షన్ ఇప్పించాడు. అయితే ఉపేందర్ ఇంటి నుంచి విద్యుత్ సరఫరా కాకుండా వైర్‌కట్ చేశాడు. ఇదేమిటని రాధాకృష్ణ అడగగా కులం పేరుతో దూషించి, మరికొందరితో కలిసి దుకాణంలోని సమాన్లను పగులగొట్టి, అద్దాలను ధ్వంసం చేశాడు. దీనిపై రాధాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దాడికి పాల్పడి, దూషించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ పేర్కొన్నారు.

# ఒలింపియాడ్‌లో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు జాతీయ బ్రిలియంట్ ఒలింపియాడ్‌లో మరోసారి సత్తా చాటి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పతకాలు సాధించినట్లు పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ గురువారం తెలిపారు. జాతీయ స్థాయిలో మాన్వీ, రాష్ట్ర స్థాయిలో మోక్షిత్, జిల్లా స్థాయిలో జైదేవ్ చౌహాన్‌తో పాటు మరి కొంత మంది విద్యార్థులు పతకాలను సాధించారన్నారు. ఈ ఏడాది జాతీయ నేషనల్ బ్రిలియంట్ ఒలింపియాడ్‌లో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు సర్వజ్ఞ పాఠశాలకు దక్కడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఆర్‌వి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఇటువంటి జాతీయ స్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా వారిలో విశ్లేషణాత్మక ఆలోచనలు పెరుగుతాయన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, వారికి దిశ నిర్దేశం చేసిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ మధిర :** మధిరలో ఈనెల 28న జరగనున్న మొదటి మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మధిర కోర్టు న్యాయమూర్తి వేముల దీప్తి కోరారు. గురువారం స్థానిక ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన మెగా లోక్ అదాలత్ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. లోక్‌అదాలత్ విజయవంతానికి పోలీస్ సిబ్బంది, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల న్యాయ వివాదాల త్వరగా పరిష్కారం అయ్యేందుకు లోక్ అదాలత్ ఒక ప్రధాన వేదికగా నిలుస్తుందన్నారు. రాజీ పడదగ్గ కేసులైన క్రిమినల్, సివిల్, ఎఐ యాక్ట్, ప్రమాద బీమా, వివాహ, కుటుంబ తగాదాలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో బార్ అధ్యక్షులు బి.పుల్లారావు, మధిర సిఐడి మధు, డి. రమేష్, ఎస్సైలు పవన్, రమేష్‌కుమార్, సాయిరాం, జనార్ధన్‌రెడ్డి, వెంకన్న, లక్ష్మీ భార్గవి, రమేష్, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** రైతులకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ శాఖ పలు కీలక చర్యలు చేపట్టినట్లు కొత్తగూడెం డివిజనల్ అధికారి ఎన్ కృష్ణ తెలిపారు. ఆళ్లపల్లి మరియు గుండాల మండలాల్లో 20242025 సంవత్సరాల్లో 2100 పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయగా, 2025 2026 సంవత్సరంలో సుమారు 1600 వ్యవసాయ సర్వీసులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మండలంలో ఉన్న లో వోల్టేజ్ సమస్యను తగ్గించేందుకు ఆళ్లపల్లి సబ్ స్టేషన్‌లో ఉన్న రెండు 3.15 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో రెండు 5 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి కోసం సుమారు రూ 1.80 కోట్లు వ్యయం చేసినట్లు చెప్పారు. ఆళ్లపల్లి సబ్ స్టేషన్‌కు సుమారు 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న 132/33కేవీ ఇల్లందు సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా జరుగుతుండటంతో దూరం ఎక్కువగా ఉండటం వల్ల లో వోల్టేజ్ సమస్య ఏర్పడుతోందని వివరించారు. ఈ సమస్యను నివారించేందుకు ఆళ్లపల్లి సబ్ స్టేషన్‌లో రూ 70లక్షల వ్యయంతో రెండు 5 ఎంవిఏ బూస్టర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయగా, రూ 30లక్షలతో రెండు కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేసి 11 కేవీ ఫీడర్లపై లోడ్ తగ్గించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా 11 కేవీ లైన్లలో ప్రతి ఫీడర్‌కు మూడు చొప్పున మొత్తం 600కేవీఆర్‌ఏ కెపాసిటర్లు సుమారు రూ 12లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇక 2026 సంవత్సరంలో మార్కోడులో 33/11కేవీ సబ్ స్టేషన్ మంజూరు కావడం జరిగిందని, దానికి సంబంధించిన పనులను ఏప్రిల్ నెలలో ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మండలంలో 132/33కేవీ నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం కూడా ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఏఈ జగదీష్, సబ్ ఇంజనీర్ నజీర్, లైన్‌మెన్‌లు పవన్, శివ, జగన్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నానో ఎరువులు, డ్రోన్ సాంకేతికతపై అవగాహన





**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచిలోని రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ)ఆధ్వర్యం లో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నానో ఎరువుల వినియోగం, డ్రోన్ సాంకేతికత ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. ఆధునిక పద్ధతులను ఉపయోగించుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించవచ్చని సూచించారు. అనంతరం వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చైతన్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలు, హెచ్‌టి పత్తి సాగు వల్ల కలిగే అనర్థాలు, భూసారా పరీక్ష అవసరం గురించి రైతులకు అవగాహన కల్పించారు. పాలేరు డివిజన్ ఉద్యాన అధికారిణి అపర్ణ మాట్లాడుతూ పామాయిల్ సాగు అవకాశాలు, ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందుబాటులో ఉన్న పథకాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి వాణి రైతులతో మాట్లాడుతూ పంట అవశేషాలను తగలబెట్టకూడదని, వరిలో ప్రాధాన్యం గల రకాలను సాగు చేయాలని సూచించారు. అనంతరం రైతులకు డ్రోన్ ద్వారా క్షేత్ర ప్రదర్శన నిర్వహించి ఆధునిక వ్యవసాయ పద్ధతులను చూపించారు. పశువైద్య శాఖ అధికారి డాక్టర్ నీలికాంత్ పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ మార్గాలపై రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఆత్మ కమిటీ సభ్యులు, టెక్నికల్ ఏవో అరుణ, వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ, రవీందర్, వంశీ, రవికుమార్, నవీన్, సౌమ్య, ప్రియాంకతో పాటు రైతులు పాల్గొన్నారు.

## బస్టాండ్, మరుగుదొడ్లు నిర్మించాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల కేంద్రంలో బస్టాండ్ మరుగుదొడ్లను తక్షణమే నిర్మించాలని, మార్కెట్ యార్డ్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ కి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. గురువారం ఆయన స్వగృహంలో పార్టీ నాయకులు కలిసి సమస్యలను ఆయనకు వివరించారు. మండల కేంద్రంలో ప్రయాణికులకు బస్టాండ్ లేకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడిసి ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలకు, మహిళలకు మరుగుదొడ్లు లేకపోవడంతో సమస్యలను ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలో మార్కెట్ యార్డుకి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనప్పటికీ నేటి వరికి మార్కెట్‌కు కేటాయించిన స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో రైతులు ఈసంవత్సరం తమ పంటలను అమ్ముకోవడం కోసం ఇబ్బందులను ఎదుర్కొన్నారని తక్షణమే మార్కెట్ యార్డ్ నిర్మాణాలను చేపట్టే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యేని కోరారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నిరుపేదలకు ప్రాధాన్యత కల్పించాలని వారు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, జిల్లా నాయకులు ఎదులాపురం గోపాలరావు, బాణోత్ ధర్మ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణే మన అందరి ధ్యేయం

**ఈగల్ టీమ్ డీఎస్పీ శివన్ నాయుడు**




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** డ్రగ్స్ రహిత తెలంగాణ మన అందరి ధ్యేయమని ఈగల్ టీమ్ డీఎస్పీ శివన్ నాయుడు అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా స్టేట్ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈగల్ టీమ్ డీఎస్పీ శివన్ నాయుడు మాట్లాడుతూ భద్రాద్రి ప్రాంత మీదుగా గంజాయి అక్రమ రవాణా జరుగుతోందని, ప్రజలు, యువత సమాచారం అందిస్తే మత్తు పదార్థాల నిర్మూలనకు సహకారం అందించినవారవుతారని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద కార్యకలాపాలపై అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం ఎస్ఐ మేడ ప్రసాద్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి అక్రమ కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. యువత మంచి మార్గంలో నడుచుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి యెదు సింహరాజు, ఉప సర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఈగల్ టీమ్ అధికారులు, అటవీ, అబ్కారీ, పోలీసు శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం

**ఈగల్ టీం ఆద్వర్యంలో డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ, ర్యాలీ**
**డ్రగ్స్, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన**





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనమవుతుందని ఈగల్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ హేమా రాణి అన్నారు. గురువారం జూలూరుపాడు మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీస్, ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన హేమ రాణి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యమైన సమాజా నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. మాదక ద్రవ్యాలు ప్రాణాయకమైనవని, వాటికి దూరంగా ఉండటమే మంచిదన్నారు. ''డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు '' అన్నారు. స్నేహితులు లేదా ఇతరులు బలవంతం చేసిన ధైర్యంగా డ్రగ్స్ కు నో చెప్పాలన్నారు. మాదక ద్రవ్యాల వలన గుండెపోటు, క్యాన్సర్, కాలేయం, లంగ్స్ పాడవుతాయని, మెదడు పనితీరు మందగించడంతోపాటు పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తుల్లో తీవ్రమైన ఆందోళన, డిప్రెషన్, ఆత్మహత్య ధోరణులు పెరుగుతాయని చెప్పారు. కుటుంబాలు చిన్నబిన్నం కావడం, డబ్బు కోల్పోవడం,చట్టపరమైన ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన, ఉజ్వలమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థిని, విద్యార్థులకు హేమా రాణి సూచించారు. విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. మానవ జీవితం అమూల్యమైనదని, దానిని డ్రగ్స్ తో పాడుచేసుకోవద్దని డ్రగ్స్, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ఆర్యవైశ్య కళ్యాణ మండపం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవ హారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాదావత్ రవి, విద్యా శాఖ అధికారి బానోత్ జూంకిలాల్, పీహెచ్సి వైద్యులు బానోత్ వెంకటేశ్వర్లు, ఎఫ్ఆర్ఓ గౌరెముచ్చు ప్రసాదరావు, ఏఎస్సై శ్రీనివాసరావు, జూలూరుపాడు హెచ్ఎం తంబళ లక్ష్మీ నర్సయ్య, ఎంపీపీఎస్ హెచ్ఎం నేతాజీ, ఉపాధ్యాయులు గుగులోత్ సీతారాములు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి మధ్యలో కరెంట్ స్తంభాలు..!

**-రహదారి విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం**
**-అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం**





**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండలంలోని అన్నపురెడ్డిపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఫోర్ వే రహదారి పనులు జరుగుతున్నప్పటికీ, ప్రధాన కూడలి వద్ద రహదారి మధ్యలోనే కరెంటు స్తంభాలు అడ్డంగా నిలిచి ఉండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తవుతున్న దశలో ఉన్నప్పటికీ ఇప్పటి వరకు విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడం వల్ల వాహనదారులు ప్రమాద భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానికుల సమాచారం ప్రకారం రహదారి విస్తరణ పనులు ప్రారంభమైన సమయంలోనే విద్యుత్ స్తంభాలను పక్కకు నిర్ణీత కొలతలతో మార్చాల్సి ఉండగా సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు, విద్యుత్ శాఖ మధ్య సమన్వయ లోపం కారణంగా గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు నిర్వహించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ వివిధ కొలతలలో స్తంభాలను ఏర్పాటు చేయడంతో రహదారి నిర్మాణం సక్రమంగా జరగలేదని వారు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా గ్రామ ప్రధాన కూడలి వద్ద రహదారి ఒంపు ప్రాంతం ఉండటం వల్ల రోడ్డుకు అడ్డంగా నిలిచిన ఈ విద్యుత్ స్తంభాలు ఎప్పుడైనా పెద్ద ప్రమాదాలకు కారణమయ్యే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫోర్ వే రహదారి నిర్మాణం పూర్తికావడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి, భారీ వాహనాలు, బస్సులు, కార్లు తరచుగా ప్రయాణించే ఈ రహదారిలో స్తంభాలు మధ్యలో ఉండటం వల్ల ప్రమాదం సంభవించే అవకాశాలు అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. ప్రత్యేకంగా రాత్రి సమయంలో ఈ సమస్య మరింత ప్రమాదకరంగా మారుతోందని గ్రామస్తులు తెలిపారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, రహదారి మధ్యలో ఉన్న కరెంటు స్తంభాలను తొలగించాలని, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

# డ్రగ్స్‌ను తరిమికొడదాం

**ఈగల్‌టీం హైదరాబాద్ డిఎస్‌పి భిక్షపతి**






**ప్రజాపక్షం/పాల్వంచ :** జీవితాలను చిన్నాభిన్నం చేసే డ్రగ్స్, మత్తుపదార్థాలను తరిమికొట్టి భవిష్యత్‌ను బంగారుమయం చేసుకొందామని ఈగల్‌టీం హైదరాబాద్ డిఎస్‌పి భిక్షపతి అన్నారు. మండల పరిధి కేశవాపురం, జగన్నాధపురం గ్రామాల మధ్యన ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ ఫంక్షన్‌హాల్‌లో పాల్వంచ గ్రామీణ పోలీసులు ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగంపై జరిగే అనర్థాలపై హైదరాబాద్‌కు చెందిన ఈగల్ టీమ్‌చే అవగాహనా సదస్సు పాల్వంచ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సతీష్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఈగల్ టీమ్ డిఎస్‌పి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయటానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడానికి ఏర్పాటు చేసిందే ఈగల్ టీమ్ అన్నారు. విద్యార్థులు మత్తు పథార్థాలైన మద్యం, గంజాయి, కొకైన్, హెరాయిన్ లాంటి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సరదాగా తీసుకొంటే అలవాటుగా మారే ప్రమాదం ఉందని, అనంతరం అది మీ జీవితాలను చీకటిమయం చేస్తుందని, ప్రమాదకరమైన మత్తు పథార్థాలు ముందుగా లివర్, లంగ్స్ పై ప్రభావం చూపి క్రమేణా శరీరం నీరసించి మృత్యువాత పడతారని హెచ్చరించారు.దీనితో మిమ్ములను నమ్ముకొని జీవిస్తున్న భార్యా పిల్లలు, తల్లిదండ్రులు అనాధలవుతారని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ విక్రయించిన వారిపైనే కాకుండా తాగిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. మాదక ద్రావ్యాల నిరోధక కేసులో ఒక్కసారి ఇరుక్కొంటే జీవితాంతం దాని ప్రభావం ఉంటుందని, ముఖ్యంగా విద్యార్థులు ఉద్యోగాలకు దూరమవుతారని అన్నారు. విద్యార్థులు విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. అప్పుడే సమాజంలో మంచి గుర్తింపుతో పాటుగా ఉజ్వలమైన భవిష్యత్‌ను పొందుతారని చెప్పారు. కావునా మనతో పాటుగా సమాజంలో డ్రగ్స్ వినియోగం, దాని వల్ల కలిగే అనర్థాలపై బాధ్యతగా అవగాహన కల్పించాలన్నారు. మనమంతా చేయి చేయి కలిపి రాష్ట్రాన్ని డగ్స్ రహితంగా చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, ప్రజలచే డగ్స్ మహమ్మారిని తరిమికొడదామని ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణ పరిధి ఇందిరా కాలనీ, నెహ్రూనగర్‌లలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్, తహశీల్దార్ దారా ప్రసాద్, పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ. సురేష్, పట్టణ ఎస్ఐలు నాగరాజు, జీవన్‌రాజు, కళ్యాణి, ఎక్సైజ్ సిఐ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ భార్గవ్, ఎంఈఓ శ్రీరామమూర్తి, మండల వ్యవసాయాధికారి శంభోశంకర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలి

**-ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ**






**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. గురువారం ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చంద్రుగొండ జాతీయ రహదారిపై నిర్వహించిన మానవహారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. ఇలాంటి వ్యసనాలకు గురై ఎవరైనా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసినా, లేదా అక్రమంగా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే 1098టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ప్రజలు సహకరించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం అవుతాయని తెలిపారు. అనంతరం చంద్రుగొండ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను ఎంఎల్‌ఏ లాంఛనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, జూలూరుపాడు సీఐ రాయల శ్రీలక్ష్మీ, డీఆర్ఓ లక్ష్మీపతి, డాక్టర్ వెంకట ప్రకాష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, మసీదు కమిటీ బాధ్యులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

**-ప్రభుత్వ ఆసుపత్రిపై తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ**
**-వైద్య సేవలపై రికార్డుల పరిశీలన**
**-రోగులతో మాట్లాడిన తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్**




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలపై ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా రక్త పరీక్షల కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్ అక్కడ నిర్వహిస్తున్న పరీక్షల రికార్డులను పరిశీలించారు. ల్యాబ్ ఇన్‌చార్జ్ రాజును పరీక్షల నిర్వహణ విధానం, రోజువారీగా వచ్చే రోగుల సంఖ్య, పరీక్షల ఫలితాల పంపిణీ విధానం వంటి అంశాలపై వివరాలు కోరారు. పరీక్షలు సమయానికి పూర్తి చేసి రోగులకు త్వరితగతిన ఫలితాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం ముక్కంటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తరువాత రోగుల వార్డులను పరిశీలించిన తహసీల్దార్ ప్రసాద్ అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యం, సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుకున్నారు.అవసరమైన మందులు, పరీక్షలు సమయానికి అందుతున్నాయా అని రోగులను ప్రశ్నించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన హెచ్‌పీవీ వ్యాక్సిన్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. మహిళలు, బాలికలకు అందిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమం సక్రమంగా కొనసాగించాలని, ప్రజల్లో అవగాహన పెంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా డాక్టర్ అమరేందర్‌రెడ్డి సహా ఆసుపత్రి సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి భాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని కోరారు.

## గ్రామాల్లో గ్యాస్ కంపెనీల దుష్ప్రచారం

**ప్రజాపక్షం/కూసుమంచి:**మండలంలోని పలు గ్రామాల్లో పలు కంపెనీలకు చెందిన గ్యాస్ కంపెనీలు భారతదేశంలో గ్యాస్ దిగుమతులకు ముప్పు ఉంది అని ఇంకా వేరే దేశాలతో యుద్ధం జరుగుతున్న సమయంలో గ్యాస్ రెట్లు పెరుగుతాయి అంటూ గ్యాస్ బండలు దొరకవు అంటూ ప్రచారం చేస్తున్నారు. దీంతో మహిళల నుండి ఒక్కొక్కరికి రెండు మూడు గ్యాస్ బండలను సేల్ చేస్తూ డబ్బులు అర్జిస్తున్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు గ్రామాల్లో ప్రజలకు ఒక స్పష్టమైన అవగాహన కలిగించాలని కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.

## గుండెపోటుతో సర్పంచ్ బాబురావు మృతి

**నివాళులర్పించిన ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్**



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం పాత కమలాపురం సర్పంచ్ తేజావత్ బాబురావు(48)గుండెపోటుతో మృతి చెందడంతో వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్ ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. హైదరాబాద్ ప్రయాణం నుండి నేరుగా ఖమ్మంలోని ఆసుపత్రికి చేరుకుని పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా బాబురావు మరణం తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని ఎంఎల్‌ఏ అన్నారు. ఆయన పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**మాజీ ఎంఎల్‌ఏ రాములు నాయక్ నివాళి**



మండల పరిధిలోని పాత కమలాపురం గ్రామ సర్పంచ్ తేజావత్ బాబురావు బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందగా వైరా మాజీ ఎంఎల్‌ఏ లావుడియా రాములు నాయక్ గురువారం ఆయన పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పాత కమలాపురం గ్రామానికి చేరుకున్న మాజీ ఎంఎల్‌ఏ రాములు నాయక్ బాబురావు భౌతిక దేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బాబురావు అకాల మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. తర్వాత మాజీ ఎంపీటీసీ ధరవత్ పాండ్య నాయక్ నివాసంలో స్థానిక నాయకులతో కలిసి కొంత సేపు చర్చలు జరిపారు. ఈకార్యక్రమంలో నాయకులు చాగంటి కోటయ్య, అజ్మీర వీరన్న, జర్పుల ప్రసాద్, శంకర్, లచ్చిరాం, బాలు, భావ్సింగ్, తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు సిద్ధం



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఈనెల 14 నుండి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు తెలిపారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 610 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. కారేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 200 మంది, తెలంగాణ మోడల్ స్కూల్ కారేపల్లిలో 210 మంది, కోమట్లగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో 200 మంది పరీక్షలకు హాజరవుతారని వివరించారు. ప్రతి కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారని, మూడు సిట్టింగ్ స్క్వాడ్లు పర్యవేక్షణలో ఉంటాయని తెలిపారు. పరీక్షా కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండగా, కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో సెక్షన్ 144 అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు ఐదు నిమిషాల ఆలస్యంగా వచ్చినా అనుమతి ఉంటుందని, సెల్ ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన క్లాక్ రూమ్‌లో భద్రపరచాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాసేందుకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

## గంగమ్మ దేవాలయానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/కామేపల్లి:** మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో యాదవ్ కులస్తుల ఆరాధ్యదైవం గంగమ్మ దేవాలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య యాదవ్ కులస్తులు, గ్రామ పెద్దలు పాల్గొని పూజలు నిర్వహించారు. దేవాలయ నిర్మాణానికి తాటిపల్ల సత్యమయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు తాటిపల్లి నరసింహారావు, వెంకటేశ్వర్లు స్థలాన్ని దానం చేయగా, యాదవ్ కులస్తులు వారిని శాలువాతో సన్మానించారు. గ్రామ పంచాయితీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సర్పంచ్ అజ్మీర ద్వాలీ చిన్న దేవాలయ నిర్మాణానికి రూ 2లక్షలు విరాళంగా అందజేయగా, కులస్తులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. తమ కులదైవం గంగమ్మ దేవాలయ నిర్మాణానికి సహాయం చేస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బాగం రంగారావు, సుతనపు కోటయ్య, పెరుగు మల్లయ్య, సైదులు, జర్పుల రామారావు, వివిధ పార్టీల నాయకులు , యాదవ్ కులస్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పదిలో పదిలం

-రేపటినుంచి పదో తరగతి పరీక్షలు
-జిల్లా వ్యాప్తంగా 98 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 16,975 మంది విద్యార్థులు
-ఒత్తిడికి లోనుకావద్దని సూచిస్తున్న నిపుణులు


(ఫైల్)

**ప్రజాపక్షం/ఖమ్మం విద్యావిభాగం :** పరీక్షల సమయం వచ్చేసింది. విద్యార్థులకే కాదు వారికి చదువుచెప్పిన ఉపాధ్యాయులకు కూడా ఒత్తిడి ఎదురుకానుంది. ఎలాగైనా తమ పిల్లలు అందరికంటే మెరుగైన ఫలితాలు సాధించాలని ఇటు విద్యాసంస్థల యాజమాన్యాలు, అటు అధ్యాపకులు మేత్రమేకాదు తల్లితండ్రులు కూడా ఆశిస్తుంటారు. చదువు విషయంలో ఇంట్లో తల్లితండ్రులు నుంచి ఉపాధ్యాయులనుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి లోనవుతుంటారు. ఒకవైపు ఆందోళన మరోవైపు ఆనారోగ్యం. పదవతరగతి పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పరీక్ష కొనసాగనుండగా 16,975 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

**పరీక్షల సమయంలో ఆందోళన.. ఆనారోగ్యం..**

విద్యార్థులు ఎండలో ఆడటం ద్వారా వడదెబ్బకు గురవుతుంటారు. కీలకమైన పరీక్షల సమయంలో పిల్లలు అస్వస్థతకు గురువుతుండటం ఆనారోగ్యం కారణంగా చదవలేకపోవడం, చదివిన అంశాలు గుర్తుండకపోవడం వంటివి జరుగుతుంటాయి. పరీక్షల్లో ఫెయిల్ అయితే తల్లితండ్రులతోపాటు బంధువులు, ఇరుగుపొరుగు వారు చులకనగా చూస్తారనే భయంతో విద్యార్థులు ఒత్తిళ్లకు లోనవుతుంటారు.

**పరీక్షల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి**

పరీక్షల సమయంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. తాజా ఆహారం, కూరగాయలు ఆకుకూరలు, మజ్జిగలాంటివి ఎక్కువగా తీసుకోవాలి. మషాలాలు, వేపుడులకు దూరంగా ఉండాలి. డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఎక్కువగా నీళ్లు తాగాలి. సరిపడా నిద్రపోవాలి.

**విశ్లేషణాత్మకంగా చదవాలి :**
**సిహెచ్ జికె ప్రసాద్ న్యూవిజన్ విద్యాసంస్థలు**

పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటే విశ్లేషణాత్మకంగా చదవాలి. ఎటువంటి ఒత్తిడిలకు గురికాకుండా, టీవి, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటు ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి చేసుకోవాలి.

**పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలు**

పరీక్షల నిర్వహణ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జీరాక్స్ సెంటర్‌లు మూసివేయించనున్నారు. ఫ్లయింగ్‌స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ పరీక్ష కేంద్రాలలో ఆకస్మికంగా సందర్శిస్తూ పరీక్షల నిర్వహణ సక్రమంగా నిర్వహించలా తీసుకోనున్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరికి మొబైల్‌ఫోన్ లు అనుమతిలేదు.

**మంచి మార్కుల సాధనకు చేతిరాత ముఖ్యమే :**
**డాక్టర్ పి భూమేశ్వరరావు, న్యూఇరా విద్యాసంస్థలు**

చాలామంది విద్యార్థులు పరీక్షలకు బాగా ప్రిపేర్ అవుతారు. ఎలాంటి కఠినమైన ప్రశ్నలు ఇచ్చినా రాసేందుకు సిద్ధమవుతారు. కాని చేతిరాత మాత్రం అంతంత మాత్రమే ఉంటుంది. ఫలితంగా వారు రాసింది. పేపర్ దిద్దేవారికి అర్థం కాకపోవడంతో వారు పడిన శ్రమకు తగిన గుర్తింపు లేకుండా పోతుంది. దీనివలన తక్కువ మార్కులు వస్తుంటాయి. అందుకే ఎక్కువ మార్కుల సాధనకు అందమైన చేతిరాత అతి ముఖ్యం.

# శ్రీరామనవమికి అదనపు బస్సులు

-ఆర్టిసి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సోలోమాన్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం రీజియన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అదనపు బస్సులు నడపనున్నట్లు టిజిఎస్ ఆర్టిసి కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ టి. సోలోమాన్ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులు, ఎపిఎస్ ఆర్టిసి అధికారులతో గురువారం ఖమ్మంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సోలోమాన్ మాట్లాడుతూ ఈనెల 27, 28 తేదీల్లో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి రోజు వారి నడిచే బస్సులతో పాటు అదనపు బస్సులను భద్రాచలంకు నడపనున్నట్లు తెలిపారు. తెలంగాణలో మహలక్ష్మి పథకం, ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీ శక్తి పథకం నేపథ్యంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి రవాణా సమస్యలు ఏర్పడకుండా తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపోల నుంచి భద్రాచలం, ఖమ్మం, హైదరాబాద్ రూట్లలో రోజు వారి బస్సులు 113 తో పాటు అదనంగా 121 బస్సులు మొత్తం 234 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలంకు రోజు వారి వచ్చే 48 బస్సులతో పాటు అదనంగా 127 బస్సులు మొత్తం 172 బస్సులు ఈనెల 27, 28 తేదీల్లో నడపనున్నట్లు ఆయన తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో



ఉంటుందని, హైదరాబాద్ నుంచి భద్రాచలం, భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి భద్రాచలంకు ప్రయాణకుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడపనున్నట్లు తెలిపారు. భద్రాచలం నుంచి ఆంధ్ర ప్రదేశ్ వైపు వెళ్లే బస్సులు జూనియర్ కళాశాల మైదానం నుంచి బయలుదేరుతాయని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం జూనియర్ కళాశాలమైదానం నుంచి భద్రాచలం ఆలయ ఆర్చీ వరకు రెండు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. భక్తులకు అందించాల్సిన మౌలిక సదుపాయాలపై, అధికారులు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన కళాశాల మైదానంను సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి రవీందర్, డిపో మేనేజర్లు, అకౌంట్స్ ఆఫీసర్స్, ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికునికి అండగా ఖమ్మం కార్మిక శాఖ

-బాధితునికి రూ. 24.50 లక్షల పరిహారం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కార్మిక కుటుంబానికి కార్మిక శాఖ మరోసారి అండగా నిలిచింది. ఎక్కడో పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మిక కుటుంబానికి చెందిన వ్యక్తి గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ పెద్ద ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. ఆర్థిక ఆసరా కోసం న్యాయవాదిని ఏర్పాటు చేసుకుని న్యాయపోరాటం చేయాలన్న కనీస అవగాహన లేని ఆ కుటుంబానికి ఖమ్మం కార్మిక శాఖ అండగా నిలిచింది. డిప్యూటీ కమిషనర్ కె. విజయ్ భాస్కర్‌రెడ్డి చనిపోయిన కార్మికుని కుటుంబానికి చట్టపరంగా దన్నుగా నిలిచారు. సంబంధిత గ్రానైట్ కంపెనీ నుంచి రూ. 24.50 లక్షల పరిహారాన్ని అందించారు. ఇంత పెద్ద పరిహారం ఒక సామాన్య కార్మికునికి అందటం అరుదైన ఘటన. పశ్చిమ బెంగాల్ నుంచి బాధిత కుటుంబాన్ని పిలిపించి పై మొత్తాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. కార్మిక శాఖ పనితీరును కార్మిక సంఘాలు సైతం అభినందించాయి. బెంగాల్ రాష్ట్రానికి చెందిన రాకేష్ జన గతేడాది ఫిబ్రవరి 23న ప్రాణాలు కోల్పోయాడు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినందుకు చట్టపరమైన చర్యలు తీసుకుని గ్రానైట్ ఫ్యాక్టరీపై కార్మిక చట్టం ప్రకారం చర్యలు తీసుకుని ఈ మొత్తాన్ని ఇప్పించగలిగారు. ఇదే సందర్భంలో గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని పరుచూరి మురళీకృష్ణ కూడా మంజూరైన రూ. 16.50 లక్షలకు తోడు మరో ఎనిమిది లక్షలు ఇచ్చి ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. కార్మికుని భార్య సోమశ్రీ, కుమార్తె మౌమిత, తల్లిదండ్రులు భాగమతి, ప్రదీప్‌లకు ఈ చెక్కును అందజేశారు.

## విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత




**ప్రజాక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన వేమిరెడ్డి తులశమ్మ జ్ఞాపకార్థం స్థానిక యూనియవర్సల్, లూర్ధు మాత విద్యాలయాల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అయిన ఫ్యాడ్లు, పెన్నులను వితరణగా అందచేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు వేమిరెడ్డి కృష్ణారెడ్డి భార్య వేమిరెడ్డి తులశమ్మ గత కొన్నినెలల క్రితం మృతి చెందింది. ఈనెల 14నుండి పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగుతుండగా వేమిరెడ్డి తులశమ్మ కూతురు నాగమణి పాఠశాల విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పది విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలి

**ప్రజాపక్షం/ తల్లాడ :** ఈ నెల 14నుండి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని తల్లాడ వైస్ ఎంపిపి అన్నం కోటిరెడ్డి అన్నారు. గురువారం కుర్నవల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదేశాల మేరకు ఆశ స్వచ్ఛదంద సంస్థ ద్వారా పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రైటింగ్ ఫ్యాడ్లు, పెన్నులను అన్నం కోటిరెడ్డి, పోతురాజు కోటయ్య చేతుల మీదుగా అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు మంచిగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించి తమ పాఠశాలకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పదవ తరగతి విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయికు పాఠశాల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఐలూరు రాజశేఖర్‌రెడ్డి, సేలం వెంకటనారాయణరెడ్డి, ఉప్పెర్ల రామారావు, నల్లబోతుల నాగమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణలో ఈనెల 14వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షల నిర్వణకు ఎర్రుపాలెం మండల పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి బి.మురళీమోహన్ రావు తెలిపారు. 9 ప్రభుత్వ పాఠశాలలను, ఒకటి కేజీబివి, 6 ప్రైవేట్ పాఠశాలల నుండి మొత్తం 421 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. మొత్తం విద్యార్థుల్లో 162మంది బాలురు, 259మంది బాలికలు ఉన్నారని తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 42మంది ఇన్విజిలేటర్లను కేటాయించామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు, వైద్య సిబ్బందిని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, పరీక్షా కేంద్రానికి హాల్ టిక్కెట్‌తో అరగంట ముందే రావాలని సూచించారు.

## ఒలింపియాడ్‌లో ఎస్‌విఎం విద్యార్థుల ప్రభంజనం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్‌లో ఎస్‌విఎం పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటారని పాఠశాల డైరెక్టర్లు డా॥ కిషోర్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో డైరెక్టర్లు కిషోర్, శ్రీధర్‌రావు, ఉమా లు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన ఐదవ తరగతి విద్యార్థిని ఆర్. గీతిక ఒలింపియాడ్‌లో జాతీయ స్థాయిలో, ఎన్. స్నేహిత్ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ఐబివో ఛైర్మన్ రామకృష్ణ, సినీ నటుడు శివబాలాజీ చేతుల మీదుగా గీతిక, స్నేహిత్ లు అవార్డు, ప్రశంసా పత్రాలను అందుకున్నారన్నారు. విద్యార్థులు విద్యతో పాటు ఆలోచన శక్తి పెరిగేందుకు ఇలాంటి ఒలింపియాడ్ పరీక్షలకు హాజరు కావాలన్నారు. పుస్తక జ్ఞానమే కాకుండా విశ్లేషణాత్మక ఆలోచన ధృక్పథాన్ని చిన్నతనం నుంచే అలవర్చుకోవాలన్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రతిభ చూపిన గీతిక, స్నేహిత్‌లను ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లుపల్లిలో పశువులకు టీకాలు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని మల్లుపల్లిలో గురువారం పశువులకు టీకా కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ధరావత్ రాము ప్రారంబించారు. ఈసంర్భంగా ఆయన మాట్లాడుతు గాలికుంటు వ్యాధి నివారణకై ముందు చర్యగా టీకాలు ఉచితంగా వేయడం జరుగుతుందని అన్నారు. పశువులకు వ్యాధులు సోకకముందే పశువైద్యలు టీకా కార్యక్రమాన్ని మొదలుపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల ఇంచార్జ్ డాక్టర్ నాగమణి, వెటర్నరీ అసిస్టెంట్ నాగేశ్వరరావు, మల్లుపల్లి గోపాలమిత్ర గడల రామారావు, రైతు రాయల పుల్లయ్య పాల్గొన్నారు.

## కస్తూరిబా పాఠశాలను సందర్శించి జిసిడిఓ

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెంలోని కస్తూరిబా పాఠశాలను జిసిడిఓ రూబి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను, మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...14వ తేదీన జరగనున్న టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు బాగా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఇంటర్ విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.

# మైనారిటీ మహిళలు ఆర్థికంగా ఎదగాలి



**-రంజాన్ గిఫ్ట్ పాకెట్లు, 163 మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**
**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




**ప్రజాపక్షం/కూసుమంచి:** మైనారిటీ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలానికి చెందిన మస్జిద్ కమిటీలకు రంజాన్ గిఫ్ట్ పాకెట్లు, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను మంత్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పవిత్ర రం జాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాసం పాటిస్తూ అల్లాను ప్రార్థిస్తూ సమాజంలో శాంతి, సౌహార్ధం నెలకొల్పాలని కోరుకోవడం అభినందనీయమని అన్నారు. అల్లా మైనారిటీ సోదరుల కోరికలు నెరవేర్చాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రతి పేదవానికి అండగా నిలుస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 200 కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలు తమ నైపుణ్యాన్ని ఉపయోగించుకుని కుట్టు మిషన్ల ద్వారా ఆదాయం పొందుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ నెలలో మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పాలేరు నియోజకవర్గానికి చెందిన 163 మంది ముస్లిం మైనారిటీ మహిళా లబ్దిదారులకు కుట్టు మిషన్లు, కూసుమంచి మండల మస్జిద్ కమిటీలకు 350 రంజాన్ గిఫ్ట్ పాకెట్లు మంత్రి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్ర అవార్డు రేసులో చింతపల్లి..!
















**- అభివృద్ధి పనులతో కొత్తరూపు సంతరించుకున్న గ్రామం**
**- 24 గంటలు ఇంటింటికి అందుతున్న నీరు**
**- సెంట్రల్ నుంచి విజిట్ చేసి కితాబు సైతమిచ్చిన అధికారులు**




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సైబీరియన్ కొంగలతో గుర్తింపు తెచ్చుకున్న చింతపల్లి ఖ్యాతి ఈ సారి కేంద్ర స్థాయిలో వినపడబోతోంది. గ్రామ అభివృద్ధి 24గంటలు నీటి నిర్వహణలో మెరుగైన పనితీరును కనబరుస్తూ కేంద్రం ఇవ్వనున్న అవార్డుల రేసులో నిలిచింది. ఈ మేరకు మినిస్టర్ ఆఫ్ పంచాయతీరాజ్ ప్రకటించే నేషనల్ పంచాయతీ అవార్డులలో భాగంగా వాటర్ సఫిసెంట్ థీమ్ కింద అందుకోబోతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులతో కొత్త శోభను సంతరించుకుంది. అలాగే సెంట్రల్ టీం కూడా గ్రామాన్ని విజిట్ చేసి కితాబును సైతం ఇవ్వడం గొప్ప విషయంగా చెప్పాలి. ఈ అవార్డులు ఏప్రిల నెలలో ప్రకటించే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.రూ. కోటి ప్రైజ్ మనీ పొందవచ్చునని పేర్కొంటున్నారు.

### 24గంటల శుద్ధమైన నీటి సరఫరా...

గ్రామంలో 24గంటల తాగు నీటి సరఫరా ఉండటంతో పాటు నీటి వనరులను సక్రమంగా నిర్వహించడం ప్రత్యేకతగా నిలిచింది. చింతపల్లి గ్రామపంచాయతీలో మూడు ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకులు, ఒక వాటర్ సంప్ ఉండటంతో గ్రామానికి పుష్కలంగా నీటి సరఫరా జరగుతోంది. పత్రి ఇంటికి 100శాతం ట్యాప్ కనెక్షన్లు కల్పించారు. అలాగే గ్రామంలో 100శాతం సోక్‌పిట్స్, 100శాతం గృహ మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అన్ని సంస్థల్లో కమ్యూనిటీ సోక్‌పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ సోక్‌పిట్స్ నిర్మించారు. డ్రైనేజ్ చివరలో కూడా సోక్‌పిట్స్ నిర్మించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతిరోజు రోడ్లు, సైడ్ డ్రైన్లు శుభ్రం చేస్తున్నారు. రోజూ వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్‌తో క్లోరినేషన్ నిర్వహిస్తున్నారు. ప్రతి నెల 1,11,21 తేదీల్లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, వాటర్ సంప్ శుభ్రపరుస్తున్నారు.

### అభివృద్ధిపై అధికారుల కితాబు...

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ఇప్పటికే సెంట్రల్ టీం గ్రామాన్ని విజిట్ చేసి సంతృప్తిని వ్యక్తం చేశాయి. పంచాయతీ పరిధిలో నీటి సరఫరా, పారిశుధ్యం, మౌళిక సదుపాయాల కల్పనలో చేపట్టిన చర్యలను జెడ్పి సీఈఓ, డిఆర్డిఓ, డిపిఓ, డిఎల్‌పిఓ, ఎంపిడీఓ అభినందించారు. గ్రామంలో ఇంటికి తాగునీటి సరఫరా, డ్రైనేజీల శుభ్రత, రోడ్ల పరిశుభ్రత వంటి అంశాల్లో పంచాయతీ తీసుకుంటున్న చర్యలు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొంటున్నారు. గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలు అవుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### చింతపల్లి ప్రత్యేకతలు :

24గంటల తాగు నీటి సరఫరా
3 ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకులు, 1వాటర్ సంప్
100శాతం ఇంటింటికి ట్యాప్ కనెక్షన్లు
100శాతం సోక్‌పిట్స్, 100శాతం గృహ మరుగుదొడ్లు రైన్ వాటర్ హార్వెస్టింగ్
పత్రి రోజు పారిశుధ్య పనులు

### గ్రామాన్ని అభివృద్ధిలో నడిపిస్తా : సర్పంచ్, ఆరెంపుల మరియమ్మ




ప్రజలిచ్చిన అవకాశంతో గ్రామాన్ని అభివృద్ధిలో నడిపిస్తా. అవార్డులో భాగంగా గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాము. వాటిని చూస్తుంటే ఎంతో ఉన్నతంగా ఉంది. అవార్డు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

### ప్రోత్సాహకంతో నీటి సమస్య లేకుండా చూస్తా : గ్రామ పంచాయతీ కార్యదర్శి, రవీందర్



అవార్డుకి సెలెక్ట్ అయితే వచ్చే నగదు ప్రోత్సాహకంతో భవిష్యత్తులో గ్రామ పంచాయతీలో ఎటువంటి నీటి కోరత లేకుండా అసరమైన చోట బోర్‌లు తవ్వించి కొత్త మోటర్లను బిగిస్తాం. కొత్త వాటర్ ట్యాంకులను కట్టించడంతో పాటు డ్రైనేజ్ సిస్టమ్స్‌లను అప్‌డేట్ చేస్తాము.

## ఘనంగా కట్ట మైసమ్మ పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో గురువారం ఘనంగా కట్ట మైసమ్మ పోతురాజు విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు గ్రామంలోని పెద్ద చెరువు కట్టపై నూతనంగా గ్రామస్తుల సహకారంతో నిర్మించిన గుడి లో కట్ట మైసమ్మ ఎదురుగా పోతురాజు విగ్రహాలను వేద పండితుల చేతుల మీదుగా వేదమంత్రాల తో మంగళ వాయిద్యాల మధ్య గ్రామస్తుల అందరి సమక్షంలో విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కర్నాటి రాజేంద్రప్రసాద్ కుటుంబ సమేతంగా హాజరై విగ్రహ ప్రతిష్టను తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొక్కిరేణి గ్రామానికి చెందిన మల్లెల వెంకటేశ్వర్లు, భాగ్యమ్మ ఎలకొండ సాంబయ్య, పద్మ గంట కృష్ణ నిర్మల దంపతులు పీటల మీద కూర్చొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులంతా సుభిక్షంగా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో పాడిపంటలతో ఉండాలని గ్రామ ప్రజలందరినీ కట్టమైసమ్మ తల్లి పోతురాజు దీవెనలు ఉండాలని వారు అమ్మవారిని కోరారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ కర్నాటి రాజేంద్రప్రసాద్, మాజీ జెడ్పిటిసి ఎల్లకొండ నాగేశ్వరరావు, చావా వెంకట్రావు, నంబూరు శేషు గద్దల నాగేశ్వరరావు, చావా రాజేష్, సిరి గద్దె ఉపేందర్, గుగ్గిళ్ళ అంబేద్కర్, ఏలూరి వెంకట్రావు, ఉలవ వీరభద్రం, ఎలకొండ బుచ్చయ్య, గద్దల మధు, ఊడుగు ఉపేందర్, గుగ్గిళ్ళ అశోక్ పాల్గొన్నారు.

## రంజాన్‌ను సంతోషంగా నిర్వహించుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రంజాన్ పండుగను ముస్లిం లు సంతోషంగా జరుపుకోవాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వం సరఫరా చేసిన రంజాన్ కిట్ల ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని పండుగ లను అందరూ ఘనంగా నిర్వహించుకోవాలని ప్రభుత్వం కిట్ల ను పంపిణీ చేస్తుందని అన్నారు. పవిత్రమైన రంజాన్ మాసం ను ఘనంగా నిర్వహించుకునేందుకు రంజాన్ ఈద్ ముబారక్ తోపా కిట్ల ను అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని మతాలను ప్రభుత్వం గౌరవిస్తుందని పేర్కొన్నారు. ముస్లిం లకు తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కి ప్రభుత్వం పాటుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, జీపీవో షేక్ జానిమియా, కడియాల నరేష్, షేక్ ఖాసింసాహెబ్ పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజం రైతులతోనే సాధ్యం




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటు రైతులతోనే సాధ్యమని ఖమ్మం రైతు శిక్షణ కేంద్రం అధికారి అరుణకుమారి పేర్కోన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యవసాయ విధానం ను బట్టి ఆరోగ్యం ఉంటుందని అన్నారు. రైతాంగం సేంద్రియ వ్యవసాయం పై దృష్టి సారించాలని సూచించారు. నేలకొండపల్లి రైతాంగం వ్యవసాయం లో వచ్చే మార్పుల ను అమలు చేయటంతో ముందుంటారని పేర్కొన్నారు. రైతాంగం విచక్షనారహితంగా మందులు వాడొద్దని సూచించారు. సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. వాటి వలన కలిగే ప్రయోజనాలను పొందాలనిసూచించారు. రసాయన ఎరువులు వాడకం వలన కలుషితమైన అహారం ను తింటున్నారని అన్నారు. సమాజం లో భద్రత కలిగిన ఆహారం ను అందించే ఏకైక వ్యక్తి రైతు అన్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుని సేంద్రియ సాగు ను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం అధికారిణి అరుణజ్యోతి, మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవో లు అవినాష్, అరవింద్, దుర్గ భవాని, శిరిషా, ఈశ్వరీ, రైతు ప్రతినిధులు చింతనిప్పు సైదులు, బాజా నాగేశ్వరరావు, మంకెన వెంకటేశ్వరరావు, రామకృష్ణ, దుంపల సుధాకర్, దేశబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నార్కోటిక్ డిఎస్పి శంకర్ యాదవ్ అన్నారు. గురువారం ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పిల్లల భద్రత, డ్రగ్స్‌కు అడ్డుకట్ట లక్ష్యంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈగల్స్ ఫోర్స్ తెలంగాణ ఆధ్వర్యంలో మండలంలోని జగన్నాధపురం, ములకలపల్లి, పూసుగూడెం, సీతారాంపురం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల నందు కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. దీనిలో భాగంగా ర్యాలీలు నిర్వహించి, రహరి కూడళ్లలో మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శులు, సీడీపీవో సీతారాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం

**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండలంలోని నల్లివారిగూడెం గ్రామానికి చెందిన ఒక వివాహిత మహిళ అదృశ్యమైన ఘటనపై ములకలపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం నల్లివారిగూడెం గ్రామానికి చెందిన ఎస్‌కే మోహరీనా(40), భర్త మీరా కులం దూ దేకుల వృత్తి కూలి. ఈమె ఈ ఏడాది ఫిబ్రవరి 16వ తేదీ ఉదయం సుమారు 8గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ములకలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మధు ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మోడల్ కాలనీగా వెలుగుమట్ల

-ఉగాది లోపు విద్యుత్ సరఫరా
-ఆత్మ గౌరవంతో జీవించేలా చర్యలు
-వెలుగుమట్లలో ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ రాష్ట్రంలోనే మోడల్ కాలనీగా వెలుగుమట్లను తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పేదలు ఆత్మ గౌరవంతో జీవించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. గురువారం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో 38 ఇండ్ల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదరికాన్ని ఆసరా చేసుకుని ధనార్జన కోసం కొంత మంది దళారులు ఫేక్ డాక్యుమెంట్‌తో పేదలకు భూదాన్ భూములను మోస పూరితంగా అప్పగించారన్నారు. 1953లో ఆసామి 31.07 ఎకరాల భూమిని భూదాన్ బోర్డుకు దానం చేశారన్నారు. భూదాన్ భూముల్లో ఉన్న పేదలు గత ఎనిమిదేళ్లుగా అనేక సమస్యలు ఎదుర్కొన్నారని త్రాగునీరు, విద్యుత్ సరఫరా వంటి సదపాయాలు లేక బాధలు పడ్డారన్నారు. పేదలు పడుతున్న బాధలను నుంచి కాపాడాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందన్నారు. భూదాన్ భూములను స్వాధీనపర్చుకోవాలని, సిసిఎల్ఏ ఇచ్చిన ఆదేశాల ప్రకారం కూల్చివేతలు జరిగాయన్నారు. వెలుగుమట్లను మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన సోనియా గాంధీ పుట్టిన రోజు డిసెంబర్ తొమ్మిది నాటికి ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పేదలకు ఇచ్చిన తర్వాత మిగిలిన భూమిలో అధునాతన స్కూల్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టం జరుగుతుందన్నారు. నిరుపేదలకు సున్న వడ్డీతో రుణాలు అందిస్తామన్నారు. వెలుగుమట్ల లేఅవుట్‌లో విద్యుత్ సరఫరా పనులు యుద్ధ ప్రాతిపదికన ఉగాది లోపు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. త్రాగునీటిపై మిషన్ భగీరథ ద్వారా త్రాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలన్నారు. దళారులకు ఎవరు ఎంత డబ్బులు ఇచ్చారో వివరాలను పోలీస్ అధికారులకు అందించాలని తెలిపారు. ప్రజలను మోసం చేసిన ఎవర్నీ విడిచి పెట్టమని కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతినగర్ వద్ద ఆర్‌టిసి బస్‌స్టాప్ ఏర్పాటు

కృతజ్ఞతలు తెలిపిన కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు శాంతినగర్ వద్ద ఆర్‌టిసి బస్‌స్టాప్ అవసరం ఉందని 20వ వార్డు కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ద్వారా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆర్‌టిసి ఆర్ఎంతో మాట్లాడి శాంతినగర్ వద్ద ఆర్‌టిసి అన్ని డిపోల బస్సులు ఆపాలి. బస్టాప్ ఏర్పాటు చేయాలని తెలపడంతో స్పందించిన ఆర్‌టిసి అధికారులు శాంతినగర్ వద్ద బస్‌స్టాప్ ఏర్పాటుకు అనుమతించారు. ఆర్‌టిసి ఖమ్మం రీజినల్ మేనేజర్ వెంటనే అన్ని డిపో మేనేజర్లకు వైరా మున్సిపాలిటీ శాంతినగర్ వద్ద ఆర్‌టిసి బస్సులు ఆపాలని ఆదేశించారు.

**ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు కృతజ్ఞతలు**

అడగగానే శాంతినగర్ వద్ద ఆర్‌టిసి బస్‌స్టాప్ ఏర్పాటు చేసినందుకు 20వ వార్డు కౌన్సిలర్ వుండ్రు శ్యామ్ బాబు దంపతులు, శాంతినగర్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వుండ్రు వరలక్ష్మి శ్యామ్ బాబు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి బస్ స్టాప్ ఏర్పాటు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, బస్సులు ఎక్కడానికి దిగడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అలాంటి సమస్యను అడగగానే పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కి ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటామని అన్నారు.

## డాక్టర్ కాపా మురళీకృష్ణకు పలువురు శుభాకాంక్షలు





ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్‌గా గురువారం ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ సమక్షంలో బాధ్యతలు స్వీకరించిన వైరాకి చెందిన డాక్టర్ కాపా మురళీకృష్ణను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో వైరా మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, ఖానాపురం సర్పంచ్ భూక్యా బాలాజి , వల్లాపురం సర్పంచ్ హనుమంతరావు, పినపాక సర్పంచ్ కృష్ణారావు, గొల్లపూడి సర్పంచ్ మేడూరి రామారావు, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, న్యూటిలిల్ ఫ్లవర్ కరస్పాండెంట్ డాక్టర్ భూమేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, బత్తుల గీత, పమ్మి అశోక్, వేముల రతానకర్, చింతూరు నాగేశ్వరరావు, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, వేల్పుల మురళి, మెరుగు రత్నరాజు, వజినేపల్లి చక్రి, మిట్టపల్లి శ్రీనివాసరావు, పల్లపు కొండలు, తోటకూర వీరబాబు, కంభంపాటి సత్యనారాయణ, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ అధ్యక్షునిగా మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరణ



ప్రజాపక్షం/ఖమ్మం : కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ మెడికల్ అండ్ హెల్త్ విభాగాపు జిల్లా చైర్మన్‌గా కాపా మురళీకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి కాంగ్రెస్ డాక్టర్స్ మెడికల్ అండ్ హెల్త్ విభాగం చైర్మన్ డాక్టర్ రాజీవ్ హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ విస్తరణలో భాగంగా డాక్టర్స్ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు విశిష్ట సేవలు అందించడమే లక్ష్యంగా డాక్టర్స్ సెల్ పనిచేస్తుందని రాజీవ్ తెలిపారు. కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల సూచనల మేరకు డాక్టర్స్ సెల్ పని చేస్తుందని ఈ అవకాశాన్ని కల్పించిన వారి నమ్మకాన్ని నిలబెడుతూ పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్‌చౌదరి, కాంగ్రెస్ నాయకులు కొండబాల కోటేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, దొబ్బల సౌజన్య, యరగర్ల హన్మంతరావు, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌తో యువత భవిష్యత్తు నాశనం



ప్రజాపక్షం/అశ్వాపురం: డ్రగ్స్ యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని డిఎస్‌పి బి రమేష్ అన్నారు. గురువారం ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పిల్లల భద్రత, డ్రగ్స్‌కు అడ్డుకట్ట లక్ష్యంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈగల్స్ ఫోర్స్ తెలంగాణ ఆధ్వర్యంలో మండలంలోని మల్లెలమడుగు, తుమ్మల చెరువు, గొందిగూడెం, అశ్వాపురం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. అశ్వాపురంలోని ఎస్‌కేటి కళ్యాణ మండలంలో జరిగిన సమావేశంలో ఈగల్ నార్కోటిక్ డిఎస్‌పి బి రమేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్ ప్రభావం వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో డిఎస్‌పి రవీందర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ ఈ రాజేష్, తహసీల్దార్ మణిధర్ పాల్గొన్నారు.

## డాక్టర్ కాపా మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరణ

-భారీగా తరలిన 20వ వార్డు ప్రజలు



ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ మెడికల్ అండ్ హెల్త్ విభాగం సెల్ జిల్లా చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి వైరా మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఖమ్మం సంజీవరెడ్డి భవన్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వుండ్రు శ్యామ్ బాబు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి సేవా కార్యక్రమాలు అందిస్తూ అందరికి అండగా ఉన్న డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ విభాగం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం శుభపరిణామం అన్నారు. అనంతరం ఖమ్మంలో బాధ్యతలు చేపట్టిన కాపా మురళీకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## లారీ, బైక్ ఢీ.. ఇద్దరు మృతి





ప్రజాపక్షం/సత్తుపల్లి: అతివేగంగా, అజాగ్రత్తగా వెళుతున్న లారీ ఒకటి ఎదురుగా బైక్ పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం సత్తుపల్లి మండలం, నారాయణపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లే పెనుబల్లి మండలం, మండాలపాడుకు చెందిన పానెం సులేమాన్ (55), సత్తుపల్లి మండలం, రేజర్ల గ్రామానికి చెందిన సాలి నాగేశ్వరరావు (60) జామకాయలు అమ్ముతూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం నారాయణపురం సమీపంలోని జామ తోటకు వెళ్లి కాయలు తీసుకొని తిరిగి సత్తుపల్లి వస్తుండగా నారాయణపురం మూల మలుపు వద్ద అతివేగంగా, అజాగ్రత్తగా వస్తున్న ఏపీ 16, టీటీ 6677 నెంబర్ లారీ బలంగా ఢీకొన్నది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న108 సిబ్బంది హుటా హుటినా సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వాళ్ల వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు, నగదు బంధువులకు స్వాధీనపరిచారు. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనతో వారి గ్రామాల్లో విషాదం నిండుకున్నది. కుటుంబ సభ్యులు కన్నీరు, మున్నీరుగా రోదిస్తున్నారు.

## మద్దిన్ని అశోక్‌కి బిఆర్‌ఎస్ నాయకులు నివాళి



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మరణించిన మద్దిన్ని అశోక్ దశదిన కార్యక్రమం గురువారం ఈ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్‌ఎస్ నాయకులు అశోక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నివాళి అర్పించిన వారిలో బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, నాయకులు ఏదునూరి శ్రీనివాసరావు, చింతనిప్పు మురళీధర్‌రావు, ఏనుగు హనుమంతరావు, ఏలూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ బాలమేళా 2.0లో వలసల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

-జిల్లా స్థాయిలో విజయ్ తేజకు ప్రథమ బహుమతి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ప్రాథమిక స్థాయి విద్యార్థుల సామర్థ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ బాలమేళా 2.0 జిల్లా స్థాయి పోటీల్లో మండలంలోని వలసల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థులను వలసల పాఠశాల ఉపాధ్యాయురాలు పార్వతి, కవితలతో పాటు మండల ఎంఈవో శాంతారా వు, మర్కోడ్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ బి బాబులాల్, డీఆర్‌పీఎల్ రాందాస్, ఎంఆర్పీలు ఈ హాథీరామ్, ఎం శ్రీనివాసరావు, ఏ రామకృష్ణ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయ్ తేజకు కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ ఎం గణేష్, జిల్లా విద్యాశాఖ అధికారి సుమతి నాగలక్ష్మి బహుమతిని అందజేశారు. ఈకార్యక్రమంలో మండల ఎంఆర్పీ ఈ హాథీరామ్, వలసల పాఠశాల ఉపాధ్యాయురాలు జి కవిత పాల్గొన్నారు.